క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ

బాలాజీచెరువు: బ్యాంక్ ఆఫ్ ఇండియా 119వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యారావుపేట బ్రాంచ్ మేనేజర్ కె.చైతన్య ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం వార్షికోత్సవం సందర్భంగా ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నాగమల్లి తోట జంక్షన్‌లో నచికేత అనాథ శరణాలయం చిన్నారులకు నిత్యావసరాలు, కూరగాయలు, పెన్నులు స్వీట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శశిఫణి, డీబీవీ స్వామి, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

కలువపూల కోసం దిగి వ్యక్తి మృతి



చెరువులో తేలియాడుతున్న శివ మృతదేహం

కాకినాడ రూరల్: గణనాథుని పూజా సామగ్రి పత్రి, పూలు, పండ్లు విక్రయించే ఆ చిరు వ్యాపారి రెండు రోజుల క్రితం చెరువులోకి కలువ పూలకోసం దిగి గల్లంతై శుక్రవారం విగతజీవిగా తేలాడు. పండగపూట ఆ ఇంట విషాదం నింపిన ఈ ఘటన వివరాలను పోలీసులు వివరించారు. కరప మండలం శివారు చిన మామిడాడ గ్రామానికి చెందిన బత్తుల శివ (63) బుధవారం స్థానికంగా ఉన్న చెరువు (మడుగు) లోకి దిగాడు. కలువ పూలు కోస్తుండగా ఫిట్స్ రావడంతో బోర్లా పడి మునిగిపోయాడు. శుక్రవారం ఉదయం శవమై తేలడంతో స్థానికుల సమాచారం మేరకు వీఆర్వో దేవగుప్తపు ప్రసన్న ఫిర్యాదుతో ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

స్థలం ఆక్రమణపై ఆందోళన



గైగోలుపాడు వద్ద ఆందోళన చేస్తున్న పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు

కాకినాడ రూరల్: ఎమ్మెల్యే నానాజీ అనుచరుడు బన్నీ సహకారంతో తన భూమిని ఆక్రమిస్తున్నారని రమణయ్యపేట గ్రామం గైగోలుపాడు వద్ద తెలుగు జనతా పార్టీ నాయకుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. సుభానికేతన్ వెనక సర్వే నంబరు 216- 2/8లో ఉన్న 24 సెంట్లు స్థలం పాలిక వెంకట రమణమ్మకు చెందినదని, ఈ సర్వే నంబరుతో ఎల్‌పీ నంబరు 159/1994కి ఎటువంటి సంబంధం లేకున్నా దరిశి చిన్నపుల్లయ్య, అనంత పద్మావతి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నానాజీ తీవ్రంగా స్పందిస్తూ కొత్త పార్టీల పేరుతో రోడ్లపైకి వచ్చి ఇష్టమెచ్చినట్టు మాట్లాడితే తోలు తీసేస్తానని హెచ్చరించారు.

సూక్ష్మ ఊయలలో సువర్ణ గణపతి





ఊయలలో ఉన్న పసిడి గణపతి, (అంతర చిత్రం) రూపకర్త తాళాబత్తుల సాయి

పెద్దాపురం: నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని సూక్ష్మ ఊయలలో పసిడితో రూపొందించిన గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు. 50 మిల్లీ గ్రాముల బంగారంతో తయారు చేసిన గణనాథుడి విగ్రహాన్ని రోజ్ ఉడ్‌తో తయారు చేసిన సూక్ష్మ ఊయలలో అందంగా అమర్చారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు గ్రహీత తాళాబత్తుల సాయి దీన్ని రూపొందించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్చకులు కోట వంశీ, ఫణి, దేవులపల్లి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

సత్యదేవుని ప్రధానాలయంలో అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండదిగువన తొలి పాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలో రుత్విక్కులు కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.



సర్పవరం జంక్షన్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు



రమణయ్యపేటలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సభ్యులు



గాంధీనగర్ ఒంటిమామిడి సెంటర్‌లో సిద్ధమైన గణనాథుని మండపం

ఆదిపూజ్యా నమామ్యహం

- మార్కెట్లకు చవితి సందడి
- పూజా సామగ్రి కొనుగోలుకు పోటెత్తిన భక్తులు
- పలు చోట్ల మట్టి వినాయక ప్రతిమల పంపిణీ
- భక్తులను ఆకట్టుకొనేలా మంటపాల అలంకరణలు

బోట్‌క్లబ్: మనం ఏ కార్యం తలపెట్టినా తొలి పూజ అందుకునేది విఘ్నేశ్వరుడే. విఘ్నాలు తొలగించే వినాయక చతుర్థిని పురస్కరించుకుని మార్కెట్లు కళకళలాడాయి. శనివారం వినాయక చవితి పండగను తమ ఇండ్లలోనూ, వ్యాపార సంస్థలు, దుకాణాల్లో నిర్వహించేందుకు భక్తులు పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు సర్పవరం జంక్షన్ వద్ద మార్కెట్‌కు పోటెత్తారు. పత్రి, వినాయక ప్రతిమలు, పూలు, పండ్లు కొనుగోలు చేసుకున్నారు. సర్పవరం పూల మార్కెట్ వద్ద సందడి నెలకొంది. నగరంతో పాటు పలు ప్రాంతాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నగరంలోని విఘ్నేశ్వర ఆలయాలతో పాటు, పలు ప్రాంతాల్లో మంటపాలు ఏర్పాటు చేసి స్వామిని నిలబెట్టనున్నారు. స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయంలోని స్వామివారి ఆలయం, సాలిపేట విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

భారీగా గణనాథులు ఏర్పాటు

నగరంలో పలు ప్రాంతాల్లో భారీ గణనాథుల్ని ఏర్పాటు చేసేందుకు కమిటీలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. స్థానిక గోకులంలోను, ఎల్‌బీ నగర్, 50 బిల్డింగ్‌సెంటర్, భానుగుడి, బాలాజీచెరువు సెంటర్, మెయిన్‌రోడ్డులోని వినాయకుడితో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక అలంకరణలతో మంటపాలు ఏర్పాటు చేశారు.



భానుగుడి సెంటర్‌లో పూజాసామగ్రి, పండ్లు, పత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

మట్టి ప్రతిమలకే ప్రాధాన్యం

పర్యావరణ పరిరక్షణకు ఈ ఏడాది అధికంగానే ప్రాధాన్యం ఇస్తున్నారు. మండపాల్లో ఏర్పాటు చేసే భారీ విగ్రహాలతో పాటు, ఇంటి వద్ద పూజించే గణనాథుని విగ్రహాలను మట్టితోనే ఏర్పాటు చేసుకుంటున్నారు. రోటరీ, లయన్స్‌క్లబ్, ధరిత్ర రక్షణ సమితితో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఇప్పటికే ఉచితంగా మట్టి గణనాథుల విగ్రహాలు పంపిణీ చేశారు.

మార్కెట్‌కు చవితి శోభ

నగరంలోని ప్రధాన కేంద్రాల్లో పూజాసామన్లు, పత్రి, పండ్లు కొనుగోళ్లకు వినియోగదారులు పోటెత్తారు. శుక్రవారం సాయంత్రం చిరు జల్లులు పడడంతో చీకటి పడేవరకూ ప్రజలు సామగ్రి కొనుగోలుకు బయటకు రాలేదు. గాంధీనగర్, మెయిన్‌రోడ్డు, అశోక్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రోడ్డుపైనే పత్రి దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

కాకినాడ రూరల్: పలు చోట్ల మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. రమణయ్యపేటలో లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్, క్లబ్ అధ్యక్షురాలు ప్రసూన, శివనాగ కృష్ణ, ఆదినారాయణరెడ్డి, శాస్త్రి, శ్రీదేవి రెడ్డి, శ్రీవాణి, విజయలక్ష్మి, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి, సభ్యులు లక్ష్మీ సృజన, మోహిని కుమారి తదితరులు పాల్గొన్నారు. వలసపాకల గ్రామంలోని గంగరాజునగర్‌లో కాకినాడ లయన్స్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో 800 వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. రాష్ట్ర ఐడీఏ కన్వీనర్ డాక్టరు అడ్డాల సత్యనారాయణ, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, షబ్బీర్, చంద్రశేఖర్, కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పంపిణీ కోసం ఏర్పాటు చేసినే వినాయక వ్రత పుస్తకాలను గుడారిగుంట క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పంతం నానాజీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్‌నాయుడు, రవిశంకర్ పట్నాయక్, శ్రీనగేష, అడబాల సత్యనారాయణ, బుద్దరాజు సత్యనారాయణ, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

మట్టివిగ్రహాల వినియోగంపై ర్యాలీ

మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాడాలని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ముమ్మిడివీరవెంకట సత్యనారాయణ పండూరులో శుక్రవారం ప్రజలకు పిలుపునిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

ఉచితంగా మట్టి ప్రతిమల అందజేత

బాలాజీచెరువు: సమగ్ర శిక్షాభియాన్ సీఎంఓ చామంతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు వినాయక మట్టి ప్రతిమలను ఉచితంగా అందజేశారు.

న్యాయవాదులకు పంపిణీ

కాకినాడ లీగల్: ప్రతి ఒక్కరు మట్టి గణపతిని పూజిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలని ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు శీమకుర్తి సురేఖ పిలుపునిచ్చారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులకు మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీ చెక్క శ్రీనివాస్, బార్ కౌన్సిల్ మెంబర్ రవికృష్ణ తదితరులు న్యాయవాదులకు ప్రతిమలను పంపిణీ చేశారు.

ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలి



మంటపాలు ఏర్పాటు చేసే వారు విద్యుత్ కోసం విద్యుత్‌శాఖ అధికారుల నుంచి, మైక్ ఉపయోగించుకొనేందుకు పోలీస్‌శాఖ అనుమతి తీసుకోవాలి. ఎటువంటి అనుమతులు తీసుకొనకుండా రోడ్డుపై మండపాలు పెట్టకూడదన్నారు.

వడ్డి ఫణీంద్ర,
దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్

16న వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం



నిమజ్జన ఏర్పాట్లపై సీఐ చైతన్య కృష్ణ తదితరులకు సూచనలిస్తున్న డీఎస్పీ రఘువీర్ విష్ణు

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట బీచ్‌లో ఈనెల 16న నగర గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో వినాయక నిమజ్జనోత్సవం నిర్వహిస్తామని సాగర్ వినాయక ఉత్సవ సమితి కాకినాడ రూరల్ కన్వీనరు రంబాల వెంకటేశ్వరరావు తెలియజేశారు. వలసపాకలలోని గంగరాజునగర్‌లో రంబాల నివాసం వద్ద శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో వినాయక చవితి జరుపుకోవాలన్నారు. హిందువుల ముఖ్య పండగకు పోలీసులు ఆంక్షలు ఎక్కువగా పెట్టడం సరికాదన్నారు. నిమజ్జనం రోజున మద్యం దుకాణాలు మూసివేయాలన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ కో కన్వీనరు బొలిశెట్టి రామకృష్ణ, పదాధికారులు కవికొండల చలపతి, అనపర్తి వెంకటేష్, సి.రెడ్డి నాగరమేష్, తదితరులు పాల్గొన్నారు. కాగా వినాయక నిమజ్జనాలు నిర్వహించనున్న సూర్యారావుపేట బీచ్‌ను డీఎస్పీ రఘువీర్ విష్ణు పరిశీలించారు. బారికేడ్లు, క్రేన్లు, క్యూలైన్ల ఏర్పాటు తదితర వాటి గురించి సీఐ చైతన్యకృష్ణ, ఎస్సై రవీంద్రబాబుకు సూచనలిచ్చారు.

పీఆర్ ప్రతిభకు బీటలు

- రెండేళ్ల శ్రమ నిష్ప్రయోజనం
- ఏ నుంచి బీ ప్లస్‌ప్లస్‌కు పడిపోయిన న్యాక్ ర్యాంకింగ్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యాప్రమాణాల స్థాయి తగ్గిపోతోంది. గత రాత్రి నేషనల్ ఎసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సెల్ (న్యాక్) విడుదల చేసిన ర్యాంకింగుల్లో 2.82 స్కోర్‌తో బీ ప్లస్‌ప్లస్ రావడంతో ఆ కళాశాల యాజమాన్యం నిరుత్సాహపడ్డారు. ఉమ్మడి జిల్లాలో పేరొందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పీఆర్ డిగ్రీ కళాశాల ఒకటి. ఈ కళాశాలలో చదివిన వారు ఎందరో సాహిత్య, కళా, సినీ, రాజకీయ రంగాల్లో పేరు గడించారు. ఇంతటి ఖ్యాతి గడించిన కళాశాలను న్యాక్ బృందం గత వారం మూడు రోజుల పాటు సందర్శించి మౌలిక వసతులు, బోధన, బోధనేతర విభాగాలను పరిశీలించారు. ఐదేళ్ల కాలపరిమితితో న్యాక్ ఇచ్చే ర్యాంకింగ్‌ను 2017లో అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ చప్పిడి కృష్ణ 3.17 స్కోర్‌తో బీ గ్రేడ్‌గా ఉన్న దానిని ఏ స్థాయికి తీసుకువచ్చారు. ఈ గ్రేడ్ పరిమితి 2022లో ముగిసింది. మళ్లీ న్యాక్ బృందం వస్తుందన్న కారణంగా సుమారు రూ.కోటి కళాశాల నిధులతో పలు అభివృద్ధి పనులు చేసినా ఫలితం లేకపోయింది. వచ్చిన కమిటీకి సరగ్గా కళాశాల వసతులు, ప్రాధాన్యాన్ని వివరించకపోవడంతో పాటు, వివిధ విభాగాల అధ్యాపకులతో ప్రిన్సిపాల్‌కు సమన్వయలోపం వల్లే ఈ స్థాయికి పడిపోయిందని పలువురు అధ్యాపకులు చెప్తున్నారు. కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ సాధించాలంటే ఇంటర్మీడియెట్‌లో 80 శాతం మార్కులతో సాధించిన ఒకొక్క సీటుకు 40 నుండి 50 మంది పోటీపడుతుంటారు. కార్పొరేట్ కళాశాలకు ధీటుగా ఉన్న ఈ కళాశాలకు తాజా ర్యాంకింగ్‌తో మరో ఐదేళ్లపాటు ప్రాధాన్యం తగ్గుతుంది. ముఖ్యంగా కళాశాలకు కేంద్ర నుంచి వచ్చే యూజీసీ, రూసా నిధులు, పరిశోధనలకు సహకారం వంటి వాటికి అవరోధం ఏర్పడుతుంది. ఏఐసీటీఈ, డీఎస్‌టీ సైన్స్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ వంటి వాటికి దరఖాస్తు చేసుకునే వాటికి అవకాశాలు తగ్గిపోనున్నాయి.



పీఆర్ డిగ్రీ కళాశాల

ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యంను వివరణ కోరగా న్యాక్ బృందానికి తగిన నాణ్యత ప్రమాణాలు కళాశాలలో కనిపించకపోవడం వల్ల గ్రేడ్ తగ్గిందన్నారు. ముఖ్యంగా పూర్తి స్థాయిలో అధ్యాపకులు, పరిశోధనలు, విద్యార్థులకు ఉపాధి తక్కువగా ఉండటం ప్రధాన కారణాలుగా ఉన్నట్టు వారు తెలిపినట్టు చెప్పారు.


కాకినాడకు అయోధ్య రామయ్య ధనుర్బాణాలు

బోట్‌క్లబ్: అయోధ్యలోని కోదండరామునికి స్వర్ణ, రజితాలతో తయారు చేసిన ధనుర్బాణాలు కాకినాడకు చేరుకున్నాయి. వాటిని స్థానిక భక్తులు దర్శించుకున్నారు. అయోధ్యవాసి చల్లా శ్రీనివాసశాస్త్రి దేశవ్యాప్త ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా శుక్రవారం గాంధీనగర్‌లోని వీరేష్ ప్రసాద్ స్వగృహంలో కొద్దిగంటల పాటు భక్తులు దర్శనార్థం వాటిని ఉంచారు. తొలుత ధనుర్బాణాలకు శాస్త్రోక్తంగా భక్తులు పూజలు చేశారు. శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ ఐదేళ్లుగా అయోధ్యలో నివాసం ఉంటున్నానన్నారు. బాలరాముని మందిర ప్రతిష్ఠకు రజిత ఇటుకను బహూకరించగా మరో నాలుగింటిని అందించాల్సిందిగా ట్రస్టు కోరగా వాటిని అందజేశానన్నారు. తాజాగా కేజీ వెండి కిలో బంగారంతో తయారుచేసిన 14 అడుగుల స్వర్ణ, రజిత ధనుర్బాణాలను పీఠాధిపతులు, మఠాధిపతులు, ప్రముఖ దేలయాల్లో స్వామివార్ల వద్ద పూజలు చేయించి వచ్చే ఏడాది కోదండ రామునికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.సత్యనారాయణ, శ్రీనివాస అచార్యులు, గరిమెళ్ల లక్ష్మీనారాయణ, తనికెళ్ల రాంబాబు, పరశురామ్, కె.సత్యనారాయణ, తదితరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రామయ్య ధనుర్బాణాలను దర్శించుకుంటున్న భక్తులు

గురువులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కాకినాడ రూరల్: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న గురువులను ఎమ్మెల్యే పంతం నానాజీ సన్మానించారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఎస్‌హెచ్ కామేశ్వరరావు, మండలంలోని కాంప్లెక్స్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపికైన పీవీ సత్యవతి, పీవీ సత్యనారాయణరాజు, బి.జానకీబాయి, జి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్‌లు సన్మానాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బందిలి వీరేష, ఎంపీడీఓ స్వప్న, ఎంఈఓలు వేణుగోపాల్, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం

కాకినాడ రూరల్: ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్ ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణను శుక్రవారం పాఠశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఇ.సూర్య ప్రకాశిని, ఉపాధ్యాయ బృందం ఆయనను అభినందించారు. పురస్కార గ్రహీత సత్యనారాయణ మాట్లాడుతూ గత ఏడాది స్కాట్‌కు 50 మంది ఉపాధ్యాయులకు, 50 మందికి గైడ్ టీచర్లకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుంచి తుని మండలం దొండవాక హైస్కూల్‌కు 100 మంది ఉపాధ్యాయులకు శిక్షణకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఎంపీటీసీ నందిపాటి వెంకటలక్ష్మి, నందిపాటి త్రిమూర్తులు గ్రామస్తులు సత్యనారాయణను అభినందించారు.



ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణ

భవిత కేంద్రంలో తనిఖీలు

గోకవరం: స్థానిక దాసరివారి వీధిలోని భవిత కేంద్రాన్ని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త (ఐఈ కోఆర్డినేటర్) కనకబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో రికార్డులను తనిఖీ చేసి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ ట్యాబ్ వినియోగంపై ఐఈఆర్‌టీలు ఎం.ఎస్తేరు రాణి, ఎస్.మణికంఠలను ఆరా తీశారు. విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరిచే విధంగా శిక్షణ ఇవ్వాలని సిబ్బందికి సూచించారు.

ముంపు సమస్య పరిష్కరించాలి

తాళ్లరేవు: భారీ వర్షాల కారణంగా స్థానిక జెల్లావారిపేట 4వ వార్డు పరిధిలోని ప్రాంతమంతా ముంపునకు గురైందని వార్డు సభ్యుడు చిక్కం సత్తిబాబు, వి.విజయభాస్కరవర్మ అధికారులకు విన్నవించారు. తక్షణం అధికారులు స్పందించి, ముంపునీటిని తొలగించాలని, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ కె.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

హైవేలో డ్రైనేజీకి మరమ్మతులు



సుంకరపాలెం జంక్షన్‌లో చేపట్టిన పూడికల తొలగింపు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో కొంతకాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్‌హెచ్ ఏఈ పురుషోత్తం పర్యవేక్షణలో డ్రైనేజీ మరమ్మతులను చేపట్టారు. రహదారిపై, డ్రైనేజీలో పూడికల తొలగింపు నిర్వహించారు.

మంటపం ఏర్పాటుపై వివాదం

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ చినవలస గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద కొందరు యువకులు వినాయక మండపం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుండగా, మరొక వర్గం వారు అభ్యంతరం చెప్పడంతో వివాదం చెలరేగింది. ఈ ప్రాంతంలో వీల్లేదని, వేరే ప్రాంతంలో వేసుకోవాలని చెప్పడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఓ వర్గానికి చెందిన యువకులు కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏఎస్సై ఏ.సత్యనారాయణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, ఇరువర్గాలతో మాట్లాడారు. గత 25 ఏళ్లుగా ఆలయ ప్రాంగణం ఎదురుగా వినాయక విగ్రహం ఏర్పాటు చేసి నవరాత్రులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు వద్దనడం ఎంతవరకు సమంజసం అని చెప్పారు. ఈ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పహరా ఏర్పాటు చేసినట్లు ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు.

దివ్యాంగుల పాఠశాలలో చవితి వేడుకలు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రిలయన్స్ ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సెంటర్ ఇన్‌చార్జి గోపాల్ నేతృత్వంలో దివ్యాంగులు వినాయకుడు, మూషికుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు స్టీఫెన్, శిరీష, సత్తిబాబు, కొప్పుల శ్రీను, కాలాడి శ్రీనివాస్, శ్రీదేవి, ఉదయకుమారి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న దివ్యాంగులు